# పుణ్యానికి పోతే...!

జనం గుంపులు గుంపులుగా మూగారు. నడిరోడ్డులో అలా జనం మూగారంటే మూడొంతులు అది ఆక్సిడెంటే అయ్యుంటుంది లేదా ఫిల్మ్ షూటింగ్ సీనైనా అయ్యుంటుంది. రెండోదానికంటే మొదటిదే ఈ రోజుల్లో కనీసం సందుకొకటైనా చూస్తు వుంటాం. ఆ గుంపూ, వాళ్ల పక్కన పడి వున్న మోటార్ సైకిలూ చూసి ఏక్సిడెంట్ అని సులభంగానే అర్థమైపోయింది. ఎవరో ఏమిటో చూద్దామే కారాపు" అంది వసంత, నేనూ కాశ్యప్ ఎంత ఒద్దంటున్నా వినకుండా.

వసంత బాధపడలేక కారాపాడు కాశ్యప్. అయితే యాక్సిడెంట్ జరిగింది ఒక ఆడమనిషికని తెలియగానే కాశ్యప్‌కూడా జాలిపడుతూ వుండిపోయాడు. పాపం ఆవిడకి ఎడమచెయ్యి మణికట్టుమీద బాగానే దెబ్బ తగిలింది. లేవలేక అలా మోచేతికి తల ఆనించి మోకాళ్లమీద కూర్చుంది. అందరూ ఆమెని వింతగా చూస్తున్నారు. కానీ ఒక్కరూ అసలు దెబ్బ ఎక్కడ తగిలింది. కళ్లు తిరుగుతున్నాయా? ఆస్పత్రికి తీసుకెళ్లాలా? ఏమీ అడగడంలేదు.

కాశ్యప్ రోడ్డుకి కొంచెం ప్రక్కగా వున్న హోటల్ నుంచి ఒక గ్లాసు మంచినీళ్లడిగి తీసుకొచ్చి ఇచ్చాడు. 'టీ తాగుతారా?' అని అడిగాడు. మంచినీళ్లు తాగి గ్లాసు తిరిగి అందిస్తూ 'టీ' అక్కర్లేదన్నట్లుగా తల వూపింది. 'లూనా'ని డిక్కీలో తనే పెట్టి కారు డోరు తెరిచి పదండి కూర్చోండి. మిమ్మల్ని ఇంటిదగ్గర డ్రాప్ చేస్తాను. లేదా ఇక్కడెవరైనా డాక్టరుంటే చూపించుకుని వెళ్లొచ్చును" అన్నాడు.

వసంత నాకు లిఫ్టిస్తానని తన కార్లో తీసుకొచ్చింది నన్ను. అందుకని నన్నుచూసి 'సారీ! ఏమీ అనుకోకే! ఆమెని దింపేసి నిన్ను దింపేసి మేం వెళతాం!" అంది నాకేసి చూసి.

"నీ మొహం నాకు సారీ ఏమిటి మధ్యలో. కాకపోతే పాపం మీ ఆయనకి ట్రబుల్ ఇస్తున్నామని బాధ పడుతున్నాం" అన్నాను. వాళ్ల ఓపికకీ సహాయం చేసే స్వభావానికీ మనసులోనే జోహారులర్పిస్తూ.

"ఆసుపత్రికే పోనివ్వండి. గాంధీ ఆసుపత్రికి. చెయ్యి చాలా నొప్పిగా వుంది" అంది. సరే నన్నాడు కాశ్యప్, మాటల్లో తాను ఎమ్.ఏ చేశానని ప్రైమరీ స్కూల్లో టీచర్‌గా పని చేస్తోందని చెప్పింది ఆవిడ.

కారు గాంధీ ఆసుపత్రి మలుపు తిప్పే సమయానికి ఆసుపత్రికి వద్దు. ఇంట్లో దింపండి. ఇంటికెళ్లి ఆసుపత్రికి వెళతాను! అంది.

అందరం ఆశ్చర్యంగా ఆమె వంక చూసినా ఇంటికెళ్లి వాళ్ల వాళ్లనెవరినైనా వెంట బెట్టుకుని ఆసుపత్రికి వెళుతుందేమో ననుకుని 'మీ ఇల్లెక్కడ?' అని అడిగాడు కాశ్యప్. 'విమాన్ నగర్' అంది. అంటే కాశ్యప్ వాళ్ల ఇంటి దగ్గర నుంచి మరో మూడు కిలో మీటర్లన్నమాట. కాశ్యప్ కొంచెం మొహం చిట్లించుకున్నా చేసేదేమీ లేదు కాబట్టి కారు మళ్లీ విమాన్ నగర్ రోడ్డువైపు మళ్లించాడు.

ఆవిడ చెప్పే గుర్తులతో దాదాపు ఇల్లు చేరుకున్నాం. ఒక పదిగజాలు ఇల్లుందనగా ఆమె ఏమండీ! అసలు నాకు ఆక్సిడెంట్ ఎలా అయింది? మీ కారే గుద్దిందా?' అంది ఏమీ ఎరగనట్టు. ఒక్క నిమిషం కారులో కూర్చున్న ముగ్గురం నోటమాటరాక అవాక్కయిపోయాం.

వెంటనే వసంత తేరుకుని భలేవారండీ మీరు! మీకు ఆక్సిడెంట్ ఎలా జరిగిందో కూడా తెలీని స్థితిలో లేరు. ఎవరో కారువాళ్లు మీకు డాష్‌కొట్టి ఆపకుండా వెళ్లిపోయారట! జనం గుంపుగూడి చోద్యం చూస్తున్నట్టు చూస్తూ వుంటే, మేము పోనీగదా అనీ, ఆడవారుకదా అనీ కారాపి సహాయం చేద్దామని కారాపాం. మిమ్మల్ని మీరుకోరిన విధంగా ఎక్కడ కావాలంటే అక్కడ దింపడానికి సరేనన్నాం! అంతేకానీ, అన్నం పెట్టే చేతినే కరిచేటట్టూ, సహాయం చేస్తూన్న వారినే అనుమానించే మీలాంటివాళ్లుంటారనే, ఎవరూ సహాయం చెయ్యడానికి

కూడా ముందుకు రాకుండా వెళ్లిపోతారు... అంది కోపంగా.

"మీరింత శ్రమపడుతూ వుంటే యాక్సిడెంట్ మీ కారువల్ల అయింది కనుకనే శ్రమపడుతున్నారనుకున్నాను. సారీ" అంది క్షమాపణగా.

ఆమెని ఇంట్లో దింపి జరిగినది వాళ్ల ఇంట్లో వాళ్లకి చెప్పి ఇల్లు చేరుకునేసరికి మరో గంట పట్టింది.

"చూశావా! నువ్వెప్పుడు కారాపండీ, ఎవరో ఏమిటో పాపం! అంటావు. అలా ఆపనందుకు ఎన్నోసార్లు నన్ను తిట్టుకున్నావుకూడా! ఇప్పుడు తెలిసిందా నేను ఎందుకాపనో? ఇంకా నయం ఇంతటితో పోయింది. లేకపోతే ఒక్కొక్కసారి సాక్ష్యాలూ, ఋజువులూ అంటూ కోర్టుల చుట్టూ కూడా తిరగాలి! అంటూ కాశ్యప్ కాళ్లూ చేతులూ కడుక్కోవడానికెళ్లాడు.

"కాఫీ తాగివెళ్లు" అంటూ వసంత నన్ను బలవంతం చేసింది. *